# అగ్రిమెంట్

లక్ష్మీశ్రీనివాసన్

అనుకున్నట్టుగానే ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు—విశ్వనాథం, సన్యాసిరాజు—భాస్కర్రావు ఇంటికొచ్చారు.

''వెళ్దామా ?'' అన్నాడు వాళ్ళకోసమే ఎదురుచూస్తున్న భాస్కర్రావు.

''అదేంటి గురూ ! అంత దూరం నుండి మీ ఇంటికొస్తే కనీసం కాస్త కాఫీ అయినా ఇవ్వకుండా 'వెళ్దామా' అంటున్నావు. ఇదేం మర్యాదగాలేదు'' అన్నాడు నవ్వుతూ,సన్యాసిరాజు.

''పాలవాడు రాలేదురా సన్యాసీ వాడికోసం చూసి చూసి నేనే హోటలుకుపోయి త్రాగొచ్చానీ వేళ, అంతగా కాఫీ త్రాగడం తప్పదంటే పద... అచ్చమాంబా కాఫీహోటల్ తెరిచేవుంది''అంటూ అరుగుమీదున్న సైకిలు దింపాడు భాస్కర్రావు.

''వద్దులే... మనం వెళ్తున్న పని పూర్తి చేసుకొని వచ్చేటప్పుడు ఎక్కడోచోట తాగొచ్చు.. నువ్వు ముందు సైకిలెక్కు''అన్నాడు విశ్వనాథం.

నిజంగా భాస్కర్రావుతో హోటలు కెళితే జరిగేదేమిటో విశ్వనాథం, సన్యాసిరాజులకు బాగా తెలుసు — 'అరె, అలావుంచు... వేవిస్తాను... మరేం ఫర్లేదులేరా... ఎగిరిపోతే మరోటి రాసిస్తాడు బిల్లు...' అలా అంటాడేతప్ప సర్వరు రాసి పడేసిన బిల్లుమాత్రం టేబిలు మీదనుంచి తీయడు భాస్కర్రావు — బిల్లు తీసుకున్న వాడి కన్నా ముందే కౌంటరు దగ్గరకు వెళ్తాడు; జేబులోంచి ఇరవైనోటో, యాభైనోటో తీసి నిర్లక్ష్యంగా హోటల్ ప్రొప్రయిటరు ముందు పడేస్తాడు. నోటు...నోటు తర్వాత వచ్చిన బిల్లు చూసి ప్రొప్రయిటరు మొహం చిట్లించుకొని ''చిల్లర లేదండీ !'' అంటాడు—అదే కావాల్సింది భాస్కరరావుకు. చిల్లర కొరతగా వుందనీ — ప్రొప్రయిటరు ఆ మాట అని తీరుతాడనీ భాస్కరరావుకు తెలియని విషయంకాదు.

అతని దగ్గర నోట్లుతప్ప చిల్లరుండదు — చిల్లర తప్ప నోట్లుండవు సన్యాసిరాజు, విశ్వనాథాల దగ్గర. అందుచేత బిల్లు చెల్లించడం వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరికి తప్పనిసరి. ఓ పావుగంట ముందే ఇళ్ళవద్ద కాఫీలు త్రాగి బయలుదేరారేమో — మళ్ళా ఇంతలోనే కాఫీ దేనికని మరేం మాట్లాడకుండా సైకిళ్ళెక్కారు విశ్వనాథం, సన్యాసిరాజులు. మరో మారు కాఫీ త్రాగాలనివున్నా వాళ్ళ ననుసరించడం తప్పలేదు భాస్కర్రావుకు.

వాళ్ళు ముగ్గురూ పన్జేస్తున్నది ఒకే ఆఫీసులో ... ఉద్యోగం చెయ్యకపోతే గడవని పరిస్థితి విశ్వనాథం, సన్యాసిరాజులది — ఉద్యోగం చెయ్యకపోయినా గడిచిపోయే వున్నత స్థితి భాస్కర్రావుది; తానుంటూండగా మూడొందలు అద్దెవచ్చే యిల్లు ... సంవత్సరానికో పాతిక బస్తాలు ధాన్యం వచ్చే పొలం ... పదిహేనువేలకు తగ్గని బ్యాంకి బేలన్సు వున్నవాడు భాస్కర్రావు.

సంవత్సరానికి మూడుసార్లు పెరుగుతున్న ఇంటి అద్దె యిచ్చుకోలేని బాధతో; నలుగురేసి పిల్లలున్న నిండైన సంసారాల్ని మొండిగా ఈడ్చుకొస్తున్న జీవితాలు విశ్వనాథం, సన్యాసిరాజులవి.

'గోడకు మేకు కొట్టారనో ... పిల్లవాడు మూత్ర విసర్జన చేశాడనో ... బల్బు పదిగంటల తర్వాత కూడా వెలిగించే వుంచుతున్నారనో ... బాత్రూం కడగటం లేదనో ... బంధువుల రాకపోకలు ఎక్కువైపోయాయనో ... ' ఇలాంటి అర్థం పర్థంలేని ఇంటి యజమానుల ఆంక్షలతో, సాధింపులతో విసుగెత్తిపోయిన విశ్వనాథం, సన్యాసిరాజులు — ఇంకా ఆఫీసులో మరికొంత మంది మిత్రులూ కలిసి చౌకలో ఏదైనా స్థలం దొరికితే కొనుక్కోవాలని ఈ మధ్యే నిర్ణయించుకున్నారు. కూడబెట్టిన కొద్దో -గొప్పో డబ్బుతో బాటు ఎప్పుడో పెరిగిన జీతాల తాలూకు ఎరియర్స్ రావడంతో వాళ్ళ నిశ్చయానికి మరింత బలం చేకూరింది.

అప్పటికి రెండు మూడు వారాలుగా ప్రయత్నిస్తున్నా వాళ్ళకింతవరకూ స్థలం బాగుంటే రేటు ఎక్కువయ్యో — రేటు తక్కువైతే స్థలం బాగుండకపోవడమో జరుగుతూ వస్తోంది.

ఆ ముందురోజు పసలపూడిలో ఏదో స్థలం వుందనీ...అది ఆ వూళ్ళో కూరగాయలమ్ముకునే కూర్మయ్యదనీ తెలుసుకున్న సన్యాసిరాజు తన మిత్రులందరికీ ఈ విషయం తెలియజేశాడు.

''ముందు మీరు చూసి రండం''టూ — స్థలం చూసొచ్చే కార్యభారాన్ని వాళ్ల ముగ్గురికీ అప్పగించారు మిగిలిన వాళ్లంతా. దాంతో ఆ రోజు బయల్దేరడం భాస్కర్రావు, విశ్వనాథం, సన్యాసిరాజులకు తప్పలేదు.

ఏదోకచోట స్థలం కొనుక్కొని పాకైనా వేసుకు వుండాలన్నంతగా విసిగిపోయిన విశ్వనాథం, సన్యాసిరాజులు— చూడబోయే స్థలమైనా కుదరాలని మనస్సుల్లో వేయిదేవుళ్ళకు మొక్కుకుంటూ సైకిళ్ల త్రొక్కుతున్నారు. ఏదొకటి కొని పడేస్తే అంతకు నాలుగింతలు లాభం పొందొచ్చని ఆలోచించుకుంటున్నాడు భాస్కర్రావు.

అరగంట తర్వాత తారు రోడ్డు వదిలి ఎర్రకంకర రోడ్డు దారికి మళ్ళారు వాళ్ళు. రోడ్డు కిరువైపులా ఎటు చూసినా చామంతి ... మల్లె... మామిడి తోటలతో— అక్కడక్కడా తాటి తోపులతో ప్రకృతికి ప్రతిరూపంగా ఎంతో అందంగా వుందా ప్రదేశం. అలాంటి ప్రదేశాలంటే విశ్వనాథానికి, సన్యాసిరాజుకు విపరీతమైన యిష్టం: 'దూరమైనా ఇలాంటి ఛోట స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకుంటే ఎంత బావుంటుందో' అనుకొంటూ వూళ్ళో ప్రవేశించారు పదినిమిషాల్లో.

పట్నానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్నా ఆ వూరింకా అంతగా అభివృద్ధి చెందలేదు ... వున్న యిళ్ళలో డాబా యిళ్లు అయిదారుకు మించి లేవు. బజార్లోకి రాగానే కూర్మయ్య గురించి తెలుసుకోవడం వాళ్ళకేం కష్టం కాలేదు.

—నలుమూలలా నాలుగు వెదురు కర్రలు పాతి, పైన తాటాకుల చాపొకటి కట్టి నాలుగైదు కూరగాయల బుట్టలు ముందెట్టుకొని కూర్చున్నాడు. కూర్మయ్య కాయ కష్టం చేసి కండలు తిరిగిన శరీరమైనా — మీద పడుతున్న వయస్సుకు లొంగిపోయి అక్కడక్కడా ముడతలు పడింది. అతడి సరసనే ఏడెనిమిది సంవత్సరాల కుర్రాడొకడు నిలబడి వున్నాడు.

అతడే కూర్మయ్య అని తెలిశాక సన్యాసిరాజు తామొచ్చిన కారణం చెప్పాడు. తన పక్కన నిలబడ్డ కుర్రాడికి కొట్టు అప్పగించి, వాళ్లను వెంటబెట్టుకొని, అయిదునిషాల తర్వాత వూరి నానుకొని వున్న తన స్థలాన్ని చూపించాడు కూర్మయ్య.

గోదావరి కాలవ ఒడ్డునే వున్న మామిడి తోటది. ఎకరానికి కొద్దిగా ఎక్కువే వుండొచ్చు. మామిడిచెట్లతోబాటు నాలుగు నేరేడు చెట్లు, అరవైకి పైగా తాటిచెట్లు కూడా వున్నాయి

''ఎలా వుంది ?'' అన్నాడు సన్యాసిరాజు భాస్కర్రావును చూస్తూ. అతడు మాట్లాడలేదు... ''నీకు ?'' అడిగాడు విశ్వనాథాన్ని.

''చాలా బాగుంది. మరి నీకో ?'' అన్నాడు మెల్లగా విశ్వనాథం.

''నాకూ నచ్చింది'' అన్నాడు సన్యాసిరాజు. ఏ అభిప్రాయమూ వ్యక్తం చెయ్యకుండా ఆ చుట్టుప్రక్కల పరిశీలనగా చూడసాగాడు భాస్కర్రావు.

''బంగారంలాంటి తోట బాబూ! దూరమని మీరు సందేహించక్కర్లేదు. ఇక్కడ్నుంచి నాలుగడుగులేస్తే మీరు రోడ్డుమీదుంటారు. గంటకోమారు ఈ వూరిమీదుగా పోయే

పిటేబమ్ముంది. ఈ తోట మా ముత్తాతకాలం నాటిది బాబూ! మొన్నటివరకూ ఈ తోట అమ్మాలనుకోలేదు. ఇందులోనే ఆ మొక్కా ఈ మొక్కా వేసి— అవిచ్చిన కాయలతోబాటు మరో నాలుగైదు రకాల కూరలు కొని అమ్ము కుంటూ పొట్ట పోసుకుంటున్నాం..."

"నీకు పిల్లల్లేరా?" మధ్యలో అడిగాడు సన్యాసిరాజు.

"ఓ కొడుకుండే వాడు బాబూ! వాడు త్రాచుపాము కుట్టి చచ్చిపోయాడు. వాడు పోయిన ఆర్నెల్లకు అంతుతెలియని జబ్బేదో నా కోడల్ని మింగేసింది. మీరు కొట్టు దగ్గర చూశారుగా వాడే నా మనవడు... ఈ పోయే కాలంలో ఇంకా కష్టంచేసి బతికే ఓపికలేదు. తోట అమ్మేసి ఆ డబ్బు ఏ బ్యాంకులోనో వేసుకుంటే వడ్డీ డబ్బులతో రోజులెళ్ళిపోతాయని మీలాంటివారే సలహా ఇచ్చారు. అందుకనే అమ్మకానికి పెట్టాను బాబూ!" అన్నాడు కూర్మయ్య.


"రేటెంత?" అడిగాడు అప్పటివరకూ మౌనంగా వున్న భాస్కర్రావు.

"ముప్ఫైవేలైతే ఇచ్చేద్దామనుకుంటు న్నాను బాబూ!"

సన్యాసిరాజు, విశ్వనాథం ఉలిక్కిపడ్డారు. నలభై వేలకు పైమాటే అనుకుంటున్న ఆ తోట ముప్ఫైవేలకే వచ్చేస్తుందంటే — వాళ్ళలో కొంత ఆశ్చర్యమూ... ఈ కూర్మయ్యకు కాస్త పిచ్చిగాని వుందా' అన్నసందేహమూ పొడసూపాయి.

"పాతికవేలైతే ఇప్పుడే బేరం సెటిల్ చేసుకుందాం" అన్నాడు భాస్కర్రావు.

"నేను బేరం చెప్పలేదు బాబుగారూ! నేనిచ్చేయాలనుకుంటున్న రేటు తమరికి చెప్పాను...ఇందుకు ఒక్క రూపాయి తక్కువైనా యిచ్చేదిలేదు. అందుకిష్టమైతేనే తోట సంగతి మాట్లాడండి!" ఖచ్చితంగా చెప్పాడు కూర్మయ్య.



"అయితే ఏ విషయమూ రెండు మూడు రోజుల్లో చెబుతాము. అంతవరకూ ఎవరికీ మాటివ్వకు" అన్నాడు మళ్ళీ భాస్కరరావు.

"రోజూ ఇలాగే ఎవరో ఒకరు వచ్చి— ఈ మాటే అని పోతున్నారు. ఎవరు నేననుకున్న రేటిస్తే వారి కమ్మెయడం తప్ప అలా అట్టే పెట్టి కూర్చొనేది లేదు బాబూ ?" నిర్మొహమాటంగా అన్నాడు కూర్మయ్య.

మిత్రులు ముగ్గురూ మొహ మొహాలు చూసుకొని అతడికి కాస్త దూరంగా వెళ్లారు.

"స్థలం తీసేసుకుందాం !" అన్నాడు సన్యాసిరాజు.

"ఈ రేటుకు ఇలాంటి స్థలం మనకెక్కడా దొరకదు. 'ఆలశ్యం అమృతం విషం' అన్నారు మన పెద్దలు" అన్నాడు విశ్వనాథం.

"మీకు తొందరపాటు తప్ప మరొకటి తెలియదు. స్థలం బాగున్నా ఈ ఏరియా ఇంతలో డెవలప్ అయ్యేది కాదు. తెల్లారిలేస్తే మనకెన్ని అవసరాలు...ఏది కావాలన్నా టౌనుకు పోవడం తప్ప దేనికీ అందుబాటులో లేని వూరది. అదీ గాక ఈ వూరి మీదుగా టౌనుకు పోయే బస్సు ఒకే ఒక్కటుంది. ఇల్లలకగానే పండగ కానట్టు స్థలం బాగుంటే సరిపోతుందా? అన్ని సౌకర్యాలు అందుబాటులో వున్నాయో లేవో చూసుకోవాలి తర్వాత మీ యిష్టం !" అన్నాడు భాస్కర్రావు.

అతడి మాట విన్న తర్వాత — విశ్వనాథం, సన్యాసిరాజులు ఆలోచనలో పడ్డారు.

"ఈ మూలకొచ్చి ఈ తోట ఇంతలోనే ఎవడూ కొనడుగాని — మనవాళ్ళతో ఆలోచించి వాళ్ళ అంగీకారమైతే రేపేవచ్చి 'అగ్రిమెంట్' రాయించుకుందాం ... పదండి" అన్నాడు భాస్కర్రావు — ఆ మాటే కూర్మయ్యకు చెప్పి సైకిళ్లెక్కారు.

* * *

మరుసటి రోజు ఆఫీసు లంచ్ టైములో తాము చూసిన స్థలం గురించీ, అది కొనడం వల్ల కొన్నేళ్ళపాటు ఎదుర్కోవాల్సిన కష్ట నష్టాల గురించీ — స్థలం కొనాలనుకుంటున్న

# అగ్రిమెంట్

వారందరికీ సవిస్తరంగా తెలియజేశాడు భాస్కర్రావు.

"వారానికొక సినిమా చూడకపోతే మా ఆడవికు నిద్రపట్టదు" అని ఒకరు; "మా బుజ్జిగాణ్ణి ఏదోక జబ్బు పట్టుకొని ఎప్పుడూ పీడిస్తూనే వుంటుంది. కనీసం డాక్టరు కూడా అందుబాటులో లేక పోతే ?" అని మరొకరూ; "అలాంటి చోట ఏం జరిగినా దిక్కూ దివాణం వుండదు...అమ్మబాబోయ్ ! ఆ అడవిలో నాకు స్థలం వద్దు" అంటూ ఇంకొకరూ— ఇలా ఎవరికి తోచిన అభిప్రాయాలు వారు వెలిబుచ్చారు.

సూర్యం మాత్రం "రేపే వెళ్ళి యిళ్ళు కట్టేస్తున్నట్టు మాట్లాడుతున్నారు తప్ప మీలో ఏ ఒక్కరూ భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని మాట్లాడ్డంలేదు. పట్నానికి పది కిలో మీటర్ల దూరంలో ఎక్కడ స్థలం కొన్నా మనం తెలివైన పనిచేసినట్టే ... ఇంత చౌకలో వచ్చే స్థలం చేజారిపోతే తర్వాత చింతించాల్సి వస్తుందేమో ఆలోచించండి !" అన్నాడు.

అయినా అతడి మాటల్ని ఎక్కువ మంది సమర్థించలేదు. విశ్వనాథం, సన్యాసిరాజులకు ఆ స్థలం తీసుకోవాలని మనస్సు పీకుతున్నా — అంత మంది అభిప్రాయాన్ని కాదని చేయగలిగిందేం కనిపించలేదు; 'భాస్కర్రావు స్వంత యిల్లు వున్నవాడు. తమకుండే బాధ, ఆరాటం అతనికుండవు ... అతని మాటెలా వున్నా మిగిలినవాళ్ళు స్థలం చూడకుండానే మాట్లాడేస్తున్నారు' అనుకున్నారు వాళ్ళు.

"ఇక ఆ స్థలం గొడవ వదిలెయ్యండి. మరొకటి ప్రయత్నిద్దాం ... నేను మూడు రోజులు సెలవుపెట్టి మా వూరెడుతున్నాను. ఈలోగా ఏదైనా దొరికితే చూడండి" అన్నాడు భాస్కర్రావు—అంతలోనే లంచ్ టైము పూర్తి కావడంతో ఎవరి పనుల్లో వాళ్ళు సర్దుకున్నారు.

* * *

ఇది జరిగిన మూడో రోజు ఉదయం పదకొండు గంటలు దాటాక భాస్కర్రావు తన అన్న సుబ్బారావుని వెంటబెట్టుకొని పసలపూడి వచ్చాడు కూర్మయ్య మనవడు కొట్టుమీద కూర్చొని ఎవరికో కూరగాయలు తూస్తున్నాడు.

"మీ తాతయ్య ఏడి ?" అడిగాడు వాణ్ణి భాస్కర్రావు.

"టౌనెల్లాడండి !" అన్నాడు కుర్రవాడు.

"ఎప్పుడొస్తాడు ?"

"మద్దేనేల కొచ్చేత్తాడండి !"

"సరే, మళ్ళా మేం ఓ గంటలో వస్తాం ... మీ తాత వస్తే ఎక్కడికీ వెళ్ళొద్దని చెప్పు" అని ఆ కుర్రాడితో చెప్పి సుబ్బారావుని తీసుకెళ్లి మామిడితోట చూపించి "ఎలా వుంది ?" అన్నాడు భాస్కర్రావు.

"చాలా బాగుంది" అన్నాడు సుబ్బారావు.

"దీని బాగు ఇప్పుడు కాదు. రెండుమూడు సంవత్సరాల తర్వాత చూడు... ఇప్పుడు ముప్పై వేలకు కొన్నది—లక్షాయాభై వేలంటే ఎగరేసుకు పోతారు. తొందర్లోనే ఈ వూరు మునిసిపాలిటీలో కలిసిపోతుంది. వూరి చివరన ఏవో రెండు ఫ్యాక్టరీలు కట్టే ప్రపోజల్ కూడా వుంది. ఇవన్నీ తెలుసుకునే నీ దగ్గరకు వచ్చాను. ఏ విధంగా చూసినా మనకు లాభమే గాని నష్టం వుండదు" అన్నాడు భాస్కర్రావు.


"ఔను.. అందులో సందేహం లేదు. ఈ వేళ 'అగ్రిమెంట్' రాయించుకుని వారం రోజుల్లో రిజిస్ట్రేషను చేయించేద్దాం !" అన్నాడు సుబ్బారావు.

— అక్కడే కాస్సేపు గడిపి పన్నెండున్నరకు కూర్మయ్య కొట్టు దగ్గరకు వచ్చారు వాళ్లు. అప్పటికీ కూర్మయ్య రాలేదు.

"వెళ్లి భోజనాలు చేసివద్దాం !" అన్నాడు సుబ్బారావు.

"ఇంకో అరగంట చూసి వెళ్దాం. ఇంతలో టీ అయినా తీసుకుందాం పద" అంటూ కూర్మయ్య కొట్టెదురుగా వున్న టీ పాక దగ్గరకు నడిచి రెండు 'టీ'లు చెప్పాడు భాస్కర్రావు —





# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### ఆర్. – రాజమండ్రి

నాకు మెడ ముందు భాగాన గొంతు దగ్గర బయటకు పొడుచుకువచ్చినట్లు ఉన్నది. ఇది "గాయిటర్" వ్యాధి అని అనుమానంగా ఉన్నది. దీనికి నివారణ ఏమిటి ?

★ ఈ అనుమానం నివృత్తి గావాలంటే సర్జన్ల దగ్గర చూపించుకోవటం అవసరం. థైరాయిడ్ గ్రంధివాపు అయితే మింగేటప్పుడు ఆ వాపుకూడా పైకీ కిందికీ కదులుతుంది. ప్రతి థైరాయిడ్ గ్రంధివాపూ గాయిటర్ కానక్కరలేదు. థైరాయిడ్‌లో అడినోమాగాని, కేన్సర్‌గాని అయి ఉండే అవకాశం లేకపోలేదు. ఈ రోగ నిర్ధారణ సర్జన్లు ప్రత్యక్షంగా పరీక్షించి చేయవలసి ఉంటుంది.

### ఎస్. – ఏలూరు

నాకు 4 సం॥ల క్రితం "థైరాయిడిజమ్" వచ్చింది. ఒక డాక్టరు జీవితమంతా ఎల్‌ట్రాక్సిన్ వాడమన్నారు. అలానే వాడుతూ ఉండాలా ?

★ మీకు ఉన్న రోగం "థైరాయిడిజం" కాదు – "హైపోథైరాయిడిజం" థైరాయిడ్ గ్రంధి మంచి ఉత్పత్తి అయ్యే థైరాక్సిన్ ప్రమాణం తగ్గటంవల్ల ఈ రోగం ఏర్పడుతుంది. ఈ రోగం ఉన్నవారు మాత్రలు వాడుతూనే ఉండాలి.

### జె. ఎస్. ఆర్. – పెనుగొండ

నా వయస్సు 15 సం॥లు. నాకు తరచు ప్రతివస్తువు రెండుగా కనబడుతున్నవి. ఒక కన్ను మూసివేస్తే మామూలుగా ఉంటుంది.

★ దీనిని డిప్లోపియా అని అంటారు. మీరు నేత్ర వైద్యులను సంప్రదించి కళ్ళు పరీక్షచేయించుకోవలసి ఉంది.

మామూలుగా ఒక వస్తువు కనబడాలంటే రెండు కళ్ళు సమిష్టిగా పనిచెయ్యటం అవసరం. ఏ కొద్ది మార్పు ఉన్నా రెండుగా కనబడే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాలలో మాత్రం కొన్ని విషపదార్థాల ప్రభావంవల్ల తాత్కాలికంగా వస్తువులు రెండుగా– కనబడవచ్చును.

### సి. జె. ఎస్ – కడప

వి. డి. ఆర్. ఎల్. అంటే ఏమిటి ?

1:2 పాసిటివ్ ఉన్నప్పుడు ఏ మందులు వాడవలసి ఉంటుంది.

ఆన్‌కైలోస్టోమా అనే పురుగు గుడ్లు కడుపులో ఉంటే ఏ మందులు వాడాలి ?

★ వెనీరియల్ డిసీజ్ రిసెర్చి లాబొరేటరీ అని వి. డి. ఆర్. ఎల్.కి అర్థం.

పాసిటివ్‌గా ఉన్నప్పుడు లాంగ్ యాక్టింగ్ పెన్సిలిన్ వాడటం మంచిది. వీటి వాడకం వైద్యుల పర్యవేక్షణలో జరుగవలసి ఉంది.

ఆన్‌కైలోస్టోమా అనే పురుగు ఉన్నవారు ఆల్కోపార్ అనే మందు వాడటం మంచిది.

### జి. ఆర్. – కదిరి

ఫిస్టులా వ్యాధికి పై పూత మందు లేక టాబ్లెట్లతో నివారణ ఉందా ? శస్త్ర వైద్యం అనివార్యమా ?

★ పై పూత మందులవల్ల ఫిస్టులా నయంకాదు. శస్త్రచికిత్స ద్వారా నయంచేయించుకోవటం మంచిది.

### సి. కె. – నరసారావుపేట

నాకు అప్పుడప్పుడు ఉన్నట్లుండి కళ్ళు తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఒక పావుగంట తర్వాత మామూలుగా ఉంటుంది. నీరసం వలననేమో అనుకొంటే భోజనం చేసిన తర్వాత కూడా కళ్ళు ఒక్కోసారి తిరుగుతూ ఉంటాయి. ఇది ఏమైనా విటమిను లోపమా.

★ మీరు బ్లడ్ ప్రెషర్, బ్లడ్ షుగర్, చాతీ ఎక్స్–రే మొదలయినవి తీయించుకొని వైద్యులకి చూపించుకోవలసి ఉంది. నెత్తురులోని హిమోగ్లోబిన్ శాతం తగ్గినప్పుడు ఇలా జరిగే అవకాశం ఉంది. విటమిన్‌ల లోపల వల్ల మాత్రమే తల తిరగటం జరుగదు. ●

---

టీలు తాగి, సిగరెట్లు వెలిగించి పాకలో వున్న బెంచీ మీద కూర్చున్నారు. కాలక్షేపం కోసం అక్కడున్న దినపత్రిక చేతిలోకి తీసుకున్నాడు భాస్కర్రావు.

పేపర్లో చాలామటుకు నేటి అరాజకీయ పరిస్థితికి సంబంధించిన వార్తలే. ఒకచోట మాత్రం 'స్నేహితుణ్ణి మోసగించి ఇరవై వేలతో ఒక వ్యక్తి పరారీ...ఒక బాకీ సొమ్ము తెచ్చుకోవడానికి ఎంతో నమ్మకమైన ప్రకాష్ అనే మిత్రుడ్ని వెంటబెట్టుకొని వెళ్లిన హరిప్రసాద్ అనే యువకుణ్ణి– డబ్బు తీసుకుని వస్తుండగా ఆ మిత్రుడే అతడ్ని మోసగించి డబ్బుతో పరారయ్యాడు. పోలీసులు అన్వేషిస్తున్నారు...' అన్న వార్త బాక్సు కట్టి ప్రచురించబడింది.

అది చూసిన భాస్కర్రావు ఒళ్ళెందుకో ఒక్కసారిగా జలదరించింది. అతడు అర్థంలేని కోపంతో పేపరు విసిరికొట్టి, పైకి లేచి "పద" అన్నాడు సుబ్బారావుని చూస్తూ.

వాళ్ళు కూర్మయ్య కొట్టు దగ్గర కొచ్చేసరికి టౌన్నుంచి బస్సొచ్చి బజార్లో ఆగింది.

నలుగురైదుగురితోబాటు కూర్మయ్య కూడా బస్ దిగి కొట్టు దగ్గరకు వచ్చి, "అదేమిటి బాబూ... తమరిలా వచ్చారు ?" అక్కడున్న భాస్కర్రావును చూస్తూనే.

"నీకోసమే ఎదురుచూస్తున్నామయ్యా... ఈవేళ మంచిరోజు... స్థలం 'అగ్రిమెంట్' రాసుకుందాం. ఇతడు మా అన్నయ్య" అన్నాడు భాస్కర్రావు.

కూర్మయ్య అయోమయంగా భాస్కర్రావు వైపు చూసి "ఇప్పుడే అగ్రిమెంటుమీద సంతకం చేసి వస్తున్నాను బాబూ! మళ్ళా అగ్రిమెంటేమిటి ?" అన్నాడు.

"అగ్రిమెంటయిపోయిందా! ఎవరికిచ్చేశావ్ ?" ఆత్రంగా అడిగాడు భాస్కర్రావు.

"అదేమిటండి బాబూ... అయితే ఈ సంగతి మీకు తెలియదా ? నిన్న విశ్వనాథం, సన్యాసిరాజు బాబులు పది, పన్నెండుగుర్ని తీసుకొచ్చి తోట చూపించి ఈవేళ అగ్రిమెంట్ రాసుకుందాం రమ్మని చెప్పి వెళ్ళిపోయారు. అన్నమాట ప్రకారం అంతా జరిగిపోయిందిలెండి... ఔనూ... ఇంతకీ వారు మీకు వాటా ఇవ్వనన్నారా బాబూ ?" అన్నాడు అమాయకంగా కూర్మయ్య.

భాస్కర్రావు హృదయం భగ్గున మండింది. అతడు కూర్మయ్యకేసమాధానం చెప్పకుండా నిస్సహాయంగా అన్నగారివైపు చూసి అక్కడ్నుంచి కదిలాడు. అసలు జరిగిందేమిటో అర్థంగాని సుబ్బారావు మౌనంగా అతడ్ని అనుసరించాడు. ★